# పాఠం

"ప్రపంచానికి తెలిసిన మొట్టమొదటి వైద్యశాస్త్రం ఆయుర్వేదం. ఆయుర్వేద వైద్య పితామహుడిగా పిలబడే చరకుడు 2500 సంవత్సరాలకు పూర్వం మనదేశంలో జన్మించాడు తెలుసా....?"

జ్యోతిషం గురించి అడగటానికి ఇంటికొచ్చిన పెద్దమనిషికి పనిలోపనిగా భారతీయ సంస్కృతి గురించి చెబుతున్నాడు మాధవాచార్యులు - హాల్లో.

దేనికోసమో ఉత్కంఠగా ఎదురుచూస్తూ, తండ్రి ప్రసంగాన్ని అసహనంగా వింటూ, విసుక్కుంటూ కాలుగాలిన పిల్లిలా అటూ-ఇటూ తిరుగుతోంది - తన గదిలో అధర్వ.

ఆరోజు ఆదివారం కొత్త మధుర పదార్థం ఏం వండాలో ఆలోచిస్తూ అన్నం ఉడికిస్తున్నది ఆ ఇంటి ఇల్లాలు జ్ఞాన ప్రసూనాంబ - వంటింట్లో.

ఆ ఇంట్లోని మరోవ్యక్తి జమదగ్ని. ఆచార్యుల పుత్రరత్నం. స్నేహితులతో కలిసి ఆటలాడుకునేందుకు వెళ్ళాడు.

హైదరాబాద్ మహానగరంలో ఒకానొక అపార్టుమెంటులోని డబుల్‌బెడ్‌రూం పేరుగల సింగిల్ బెడ్‌రూం కంటె చిన్నదైన ఫ్లాట్ అది. మాధవాచార్యులు ఉపాధ్యాయ వృత్తి ద్వితీయార్థంలో ఉన్నాడు. ఆయన సంపాదనకు తోడు అర్ధాంగి పొదుపు-అదుపు వాళ్ళ జీవితం సాఫీగా సాగేలా చేయడమేగాక ఆఫ్లాటు కొనుక్కునే స్థితికి చేర్చాయి - బ్యాంకు అప్పు తీర్చాల్సి ఉండటం వేరే విషయం. అమ్మాయి పెద్దది ఎం.బి.ఏ. చదువుతోంది. చక్కని చుక్క. అబ్బాయి ఇంటర్. చదువులో ఫస్ట్. ఆచార్యుల ఉద్యోగానికి తోడు సద్యోగం- జాతక చక్రాలు వ్రాయడం, వాస్తు చూడటం, ముహూర్తాలు నిర్ణయించడం వగైరాలు. ఆ విషయంలో సంప్రదించేందుకు వచ్చిన ఓ సజ్జనుడితో ఆయన ప్రసంగం అలా సాగుతూ ఉంది -

"పాశ్చాత్య అంతరిక్ష శాస్త్రవేత్త స్మార్ట్ కంటె వందల సంవత్సరాలకు పూర్వమే మన దేశానికి చెందిన భాస్కరాచార్యుడు భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి తీసుకునే సమయాన్ని ఖచ్చితంగా లెక్కగట్టి చెప్పాడు. 5వ శతాబ్దంలో ఆయన చెప్పిన సమయం 365.258756484 రోజులు....."

అతను ఆశ్చర్యం, ఆరాధన నిండిన భావంతో ఆచార్యులను చూస్తున్నాడు.

"ఇప్పుడు తలలు వేరుచేశాం, మొలలు వేరుచేశాం, గుండెను ముక్కలు చేసి అతికించాం. ఇదంతా పాశ్చాత్య విజ్ఞాన సర్వస్వం అంటూ వెర్రివాజమ్మాల్లా, మనవాళ్ళు అంటున్నారుగానీ, 2600 సంవత్సరాలకు పూర్వమే మెదడుకు శస్త్ర చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ, సిజేరియన్, కేటరాక్ట్, మూత్రనాళాల్లో రాళ్ళ తొలగింపు వంటి జటిలమైన రోగాలను శస్త్రచికిత్స ద్వారా నయం చేసిన మహాభిషగర్వుడు శుశ్రుతుడు మనదేశంలోనే పుట్టాడు.

"అంతెందుకు? అమెరికాకు చెందిన ఐ..ఇ.ఇ.ఇ సంస్థ పేరు వినే ఉంటారు. ఆ సంస్థ స్వయంగా ఓ సంగతి ప్రకటించింది - 'వైర్‌లెస్ కమ్యూనికేషన్ పరిజ్ఞానాన్ని, రేడియో తరంగాలను కనుగొన్నవాడుగా మార్కొని పేరు సంపాదించాడుగాని, నిజానికి ఆ ఘనత దక్కాల్సింది భారతీయ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్‌కేనని.

"జ్యోతిశ్శాస్త్రంపట్ల సరైన అవగాహన లేకుండా అనేక పూర్వపక్షాలు చేస్తున్నారుగానీ....."

హాల్లో ఫోన్ రింగయ్యింది.

లోపలి గదిలో అధ్వర ఎగిరి గంతేసింది. ఆనందం తట్టుకోలేక చిన్నగా కేక కూడా పెట్టింది. కాకపోతే అది మిగతావాళ్ళకు వినబడే అవకాశం లేదు.

తండ్రి ఫోన్ రిసీవ్ చేసుకొని తనకు చెప్పాలని సెకన్లు లెక్కపెడుతూంది అధ్వర.

ఆమె కోరుకున్నట్లు ఆచార్యులు ఫోన్ ఎత్తలేదు - "బంగారూ! ఫోన్ చూడమ్మా!" అంటూ అధ్వరకే ఆ పని పురమాయించి, అంతరాయానికి కించిత్ విసుక్కుంటూ మళ్ళీ తనపనిలో లీనమయ్యాడు.

కొంత నిరుత్సాహానికి గురయ్యింది అధ్వర. ఆ వచ్చే ఫోన్ మెసేజ్ తనకు తెలిసిందే. కాని, అది తండ్రి ద్వారా తనకు చేరాలనేది ఆమె అభిలాష. రిసీవరెత్తింది.

"హలో! మేఘనా!" ఆపేరు తండ్రికి వినబడాలని, అమ్మాయితోనే మాట్లాడుతున్నానని తండ్రిని నమ్మించే ప్రయత్నం ఆమెది.

ఆయన అదేమీ పట్టించుకునే స్థితిలో లేడు. ఆ ఫోన్ తనకోసం కాదనే సంగతి స్పష్టంకాగానే, ఆ సంభాషణమీద ఏ మాత్రం దృష్టినిల్పలేదు. అన్నిటినీ మించి కూతురునెన్నడూ అనుమానించలేదు ఆచార్యులు.

రెండు నిముషాలు మాట్లాడింది అధ్వర. తర్వాత తండ్రితో అన్నది - "నాన్నా! ఈరోజే అలేఖ్యపెళ్ళి. అది త్వరగా రమ్మంటోంది. సాయంత్రం కూడా రావడానికి ఆలస్యమవుతుందట...." ఆమె స్వరం అనుమతిని అభ్యర్థిస్తున్నది.

"సరేలేమ్మా! వెళ్ళి త్వరగా వచ్చెయ్...." అది చాలా తేలికైన విషయంలా అనేసి- ప్రసూనా! అమ్మాయికి డబ్బులిచ్చి పంపించవోయ్.... కూడా అగ్నిని తీసుకెళ్తావమ్మా?" అతని గొంతులో ఆప్యాయత.

ఉలిక్కిపడింది అధ్వర. 'అగ్ని వస్తే ఇంకేమైనా ఉందా?' గుండెవేగం పెరిగింది.

"ఇంకెక్కడి అగ్ని? వాడెప్పుడో ఆటాడుకునేందుకు వెళ్ళాడు. క్రికెట్ కిట్ భుజానికేసుకొని. రాత్రికి రావడం కూడా అనుమానమే. ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ ఏదో ఉందట." వంటింట్లోనుండే వార్తావాఖ్య వినిపించింది జ్ఞానప్రసూనాంబ.

అవధుల్లేని ఆనందం అధ్వర గుండెనిండా. పైకి మాత్రం - "ఛా! వీడెప్పుడూ ఇంతే!" అంటూ లేని అసంతృప్తిని ప్రకటించింది.

శ్రీకృష్ణుని మురళీరవళికి పరవశమైన గోపికలా కంగారుకంగారుగా తయారైంది. అమ్మకూ, నాన్నకూ 'బై' చెబుతూ బయటపడింది.


'ఈయేడాది దాటాక ఈ బంగారు తల్లి పెళ్ళిచేసెయ్యాలి.' మనసులోనే అనుకున్నాడు ఆచార్యులు.

అంత తేలిగ్గా బయటపడగలననుకోలేదు అధర్వ. సంతోషంతో ఆమె మనస్సు పట్టపగ్గాల్లేనట్టుగా ఉంది. ఆ సంతోషం ఆలేఖ్య పెళ్ళికి వెళ్ళాలనే తాలూకు కాదని, ఆ వంకతో ఆ సాయంత్రం తన ప్రియుడు నిఖిల్‌ని కలుసుకోవడం తాలూకాని ఆమెకు మాత్రమే తెలుసు.

ఈ అవకాశం కోసం పదిహేను రోజులుగా ఎదురుచూస్తుంది. పెళ్ళి పదకొండింటికి. నిఖిల్‌ని కలుసుకోవాల్సింది సాయంత్రం ఐదింటికి. అసలు పెళ్ళికూడా ఎగ్గొట్టి సాయంత్రం దాకా లవర్స్‌పార్క్‌గా ప్రసిద్ధికెక్కిన దుర్గంచెర్వులో గడిపేసి, సాయంత్రం ఓ రిసార్ట్స్‌కెళ్దామనేది నిఖిల్ ప్రతిపాదన. ముందు తనూ ఓకే అంది కాని, వచ్చేది ఆ వంకతో. కనీసం ఆ పెళ్ళి అటెండ్ కాకపోవడం పాపంకదా? అనిపించింది. అంతేగాక అలేఖ్య అంటే నిజంగానే తనకు వల్లమాలిన అభిమానం. ఆ స్థానంలో మరెవరున్నా వెళ్ళేదికాదు..... ఆలోచనల్లో ఉండగానే ఓ ఆటో కనిపించింది. కూర్చొని అడ్రసు చెప్పింది.

రోడ్డువారగా ఓ జంట చెట్టపట్టాలేసుకొని నవ్వుతూ వెళ్తున్నారు.  ఎటో వెళ్ళిపోయింది అధ్వర మనసు.....

నిఖిల్‌తో ప్రేమలో పడ్డాక అన్నీ ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. ఆ జంట స్థానంలో తాముంటే.... ఇలా రోడ్లమీద తిరుగుతారా?  ఈ మధ్య అన్నీ ఇలాంటి ఊహలొస్తున్నాయేంటి? సినిమాల్లో హీరో హీరోయిన్లకు ఊహల రెక్కలు తొడిగి, థియేటర్లను డ్యుయేట్లతో ఆదరగొడ్తాంటే! ఛీ! ఇంత సిల్లీగా ఎలా ఆలోచిస్తారు డైరెక్టర్లు?' అని ఈసడించుకునేది కానీ, అలాంటి ఊహలే వస్తున్నాయి.  కాకపోతే స్టెప్పులూ, సాంగులూ లేవు -




సెలయేళ్ళు - జలపాతాలు

పక్షుల కిలకిలా రావాలు

చిట్టి కుందేలు - చిన్నారి జింక

నాట్యమయూరి - నల్లని మబ్బులు

మబ్బుల చాటున దోబూచులాడే చందమామ

మలయానిలుని గిలిగింతలు

చిరుజల్లుల కవ్వింపులు....

ఆ అద్భుతమైన ప్రకృతిలో

ప్రకృతికే ప్రతిరూపంలా,  అందానికి అందం

తాను -

నిఖిల్ మేరువైతే

అతన్ని చుట్టుకొని

గలగల ప్రవహించే

సెలయేరులా,

అతనో వృక్షమైతే

బిగియారా కౌగిలించుకునే లతలా,

అతను చంద్రశిల అయితే

ఆ తుషార స్పర్శలా

అతనిలో తను.....

తనలో అతను -

"మీరు చెప్పిన ఫంక్షన్ హాల్ గిదేనా మేడం?" ఆటోవాలా అధ్వరను ఈ లోకంలో పడదోశాడు.

అంతరాయానికి అసంతృప్తి చెందినా, తన పరిస్థితికి సిగ్గుపడిపోయింది. ఆటోవాలాకి డబ్బులిచ్చి, ఫంక్షన్ హాల్లోకి నడిచింది - అధ్వర.

"ఏయ్ కాస్త పెళ్ళి పందిరికి దూరంగా ఉండవే." మండపంలోపలికి ప్రవేశించగానే స్నేహితురాండ్ర బృందాన్ని వెనకేసుకుని తిరుగుతున్న సాహితి, అధ్వరనుద్దేశించి అంది.

"ఎందుకు?" షాక్ నుండి తేరుకుంటూ అడిగింది అధ్వర.

"ఎందుకా? నిన్ను చూస్తే ఆ పెళ్ళికొడుకు అలేఖ్యనుకాదని, అమాంతం నీ మెళ్ళో తాళిగట్టేట్టున్నాడు." వెటకారం జోడించింది సాహితి.

విషయం అర్థంకాగానే చుట్టూ ఉన్న స్నేహితురాళ్ళు నవ్వారు. నవ్వలేక నవ్వింది అధ్వర.

"మేకప్ టూమచ్ అయ్యిందా?" తనలో తను అనుకున్నట్టే పైకి అనేసింది అధ్వర - మేఘనను చూస్తూ. ఉన్నకోతి మూకలో అదే తన పక్షం వహిస్తుందనే ఆశతో.

మేఘనకు అవకాశం ఇవ్వకుండా సాహితే అందుకుంది మళ్ళీ - "మేకప్ టూమచ్‌గాలేదే. నువ్వే ఉన్నావు టూ-మచ్-..... బ్యూటీఫుల్ గా. పెళ్ళికొడుకు దాకా ఎందుకు? ఈ అందం చూస్తే, ఏ మగాడైనా ఇట్టే ఎగరేసుకుపోతాడు...." అది చాలదన్నట్లు కన్నుకొట్టింది.

"యూ! డర్టీగాళ్...." పళ్ళు బిగబట్టి చెయ్యెత్తింది అధ్వర.

ఎత్తిన ఆ చేయిని ఒడిసి పట్టుకొని మరింత గడుసుతనం ప్రదర్శించింది సాహితి - "పో! పోవమ్మా! ఇలాంటి వాళ్ళని ఎంతమందిని చూడట్లేదు? నేడో-రేపో నిన్నెవడైనా లేవదీసుకుపోడా, మేం చూడమా?!"

బిత్తరపోయింది అధ్వర. 'కొంపదీసి తన సంగతంతా మేఘనగానీ.....' కళ్లతోనే ప్రశ్నించింది.

ఇదంతా నాకేం తెలీదన్నట్టు భుజాలెగరేసింది మేఘన.

ఇంతలో పురోహితుడు వచ్చేశాడు. జనంకూడా రావడం హెచ్చింది. అలక నటిస్తూ వేదికకు కొద్ది దూరంలో ఆడవాళ్ళ వరుసలో ఒక పక్కగా కూర్చుంది అధ్వర- స్నేహితురాండ్రు పిలుస్తున్నా వినపడనట్టే. ఆ ప్రక్కనే కూర్చున్న కుర్రపంతులొగాయన ఆమెని చూసి పలకరింపుగా నవ్వాడు. చిర్రెత్తుకొచ్చింది ఆమెకు.

'హుఁ ! మొలతాడున్న ప్రతివాడూ లొట్టలేసేవాడే! అయ్యవారికి కూడా తనంటే అంత ఇంట్రస్టా?' మొహం చిట్లించుకొని పక్కకు తిప్పుకుంది.

'నిజంగా తన అందం అంతగా రెచ్చగొడుతుందా?' మళ్ళీ ఆమె ఆలోచనలు నిఖిల్‌వైపు మళ్ళాయి. జంతుప్రదర్శనశాలలాంటి ఈ పెళ్ళి పందిర్లో కూచోవడం కంటే, హాయిగా దుర్గంచెర్వులో నిఖిల్ ఒడిలో.... తన అందాలతో ఊరిస్తూ, రెచ్చగొడుతూ ఆడుకుంటూంటే ఎంత థ్రిల్లింగ్‌గా ఉండేదో! ఇంత జనసందోహంలో తను ఉన్నా, లేకున్నా ఒక్కటే. అదే నిఖిల్ సమక్షంలో....

"శుక్లాం బరధరం విష్ణుం......" క్షణాల్లో పెళ్ళి హడావుడి మొదలైంది. మైకులో దంచేస్తున్నాడు పురోహితుడు.

"వధూవరులను సాక్షాత్తూ లక్ష్మీనారాయణులుగా భావించి వారిని గౌరవించడం, అలంకరించడం, ఈ శుభకార్యం జరిపించడం మన భారతీయ సాంప్రదాయం....."

పక్కకు తిరిగి చూసింది అధ్వర. ఇందాక పలకరింపుగా నవ్విన పంతులుగారే కమ్మని కంఠస్వరంతో మండపంలో వేదికపై జరుగుతున్న కార్యక్రమాన్ని వ్యాఖ్యానిస్తున్నాడు. అతని పక్కనే కూర్చున్న ఓ పదాహారేళ్ళ అమ్మాయి ఆరాధనగా అతడ్ని చూస్తూ, ఆసక్తిగా వింటున్నది. ఆమెకోసమే అతను చెబుతున్నా. చుట్టూ ఉన్నవాళ్ళందరికీ వినిపిస్తున్నది. వింటున్న వాళ్ళలోనూ కుతూహలమేగాని విసుగుదల కన్పించడంలేదు. అందుకు అతని స్వరం, వదనం, సంభాషణా చాతుర్యం కూడా కారణం కావచ్చు.

అధ్వర కూడా వేదికమీద జరిగే తంతు చూస్తూ, వీనుల విందైన వాఖ్యానం వినసాగింది - పాతకాలంలోని మూకీసినిమాను ఎంజాయ్ చేస్తున్నట్టు.

"ముందుగా అత్తవారు తమకు కాబోయే కోడలు పిల్లని పూర్తిగా తమదనిపించుకునేందుకు గానూ వస్త్రాలు, ఆభరణాలు వగైరాలనిస్తున్నారు. ఇదే వివాహంలోని తొలి ఘట్టం. దీన్ని

ప్రధానం అంటారు. ఇది ముఖ్యమైంది, మొదటిది కాబట్టి ప్రధానం అనీ వ్యవహరిస్తూంటారు. అమ్మాయి అవన్నీ తీసుకొని, సాలంకృతయై, గౌరీపూజ చేసి మళ్ళీ వస్తుందన్నమాట....."

వధువును, వస్త్రాభరణాలనూ తీసుకొని వెళ్ళారు ముత్తైదువులు.

పచ్చని తోరణాల మధ్య, ఒకపక్క పెద్దల హడావుడి, మరోపక్క పురోహితుని వేదమంత్రాలు- చక్కని సన్నాయిమేళం, నేపథ్య సంగీతంలో వరుడు వేదిక మధ్యానికి వచ్చాడు - తోడుగా పిన్నా పెద్దల కలకలంతో.

ఆదృశ్యం మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తున్నది అధ్వరకి. చిన్నప్పటినుండీ తరచూ పెళ్ళిళ్ళకు హాజరవుతున్నా ఇంత సూక్ష్మంగా ఎప్పుడూ గమనించలేదు. ఆ దృశ్యంలోని ప్రతి అణువూ ఆత్మీయంగా ఆమెను పలకరిస్తున్నది. రెండ్రోజుల క్రితం నిఖిల్ అన్నమాటలు గుర్తొచ్చాయి - "ధరా! ఈ మాంగల్యం- బీంగల్యం అంతా ట్రాష్. మనసులు కలిశాయి, తనువులు కలుస్తాయి. ఒకరిపట్ల ఒకరికి నమ్మకం ఉంటే చాలు. జీవితాన్ని ఎంజాయ్ చెయ్యడానికి దమ్ముండాలి. ఇలాంటి పనికిమాలిన సెంటిమెంట్లుకాదు !" అప్పుడా మాటలు ఎంతో మధురంగా అనిపించాయి. ఇప్పుడా మాటలు చీప్‌గా అనిపించసాగాయి. మరోపక్క పంతులుగారి వ్యాఖ్యానం సాగుతోంది.

"అది వరపూజ. కాబోయే అల్లుడు తమవాడు. తమకారాధనీయుడు సాక్షాత్ నారాయణ స్వరూపుడు. అందుకే అత్తమామలు భక్తి పూర్వకంగా అతని కాళ్ళు కడిగి మధుపర్కాలు సమర్పిస్తున్నారు...."

"మరి వధువు లక్ష్మీస్వరూపం గదా! ఆమె కాళ్ళు అత్తామామలు ఎందుకు కడగలేదు?" ఆ పక్కనున్న అమ్మాయి ఠక్కున అడిగింది.

పంతులుగారూహించని ప్రశ్న అది. వెంటనే జవాబుచెప్పలేకపోయాడు. ఆలోచించుకొని చెప్పాడు - "బహుశా మనది పురుషాధిక్య సమాజంగదా మొదటినుంచీ. అల్లుణ్ణి అత్తమామలు, అమ్మాయి తరపువాళ్ళందరూ ఆదరించాలనడానికి సంకేతంగా ఈ సంప్రదాయం ఏర్పడి ఉండవచ్చు." క్షణమాగి మళ్ళీ అన్నాడు- " మరో రకంగా ఆలోచిస్తే - పెళ్ళికొడుకు మండపంలోకి కాలినడకన వస్తాడు కాబట్టి వివాహ వేదిక పవిత్రతను చాటేందు కోసం ఈ పద్ధతి ఏర్పాటై ఉంటుంది....."

"మరి పెళ్ళి కూ...... " అడ్డుకోబోయింది ఆ అమ్మాయి.

"చెప్తున్నా! ఇప్పటికీ పెళ్ళికూతురుని ఏదో విధంగా కాలు నేలకు తాకకుండానే వేదిక వద్దకు తీసుకొస్తున్నారు."

ఆ సమాధానం సంతృప్తి పరచినట్టులేదా అమ్మాయిని, అయినా ఆ సంగతి వదిలేస్తున్నట్టు మరో ప్రశ్న అడిగింది - "మధు పర్కాలంటే?"

" అబ్బాయిని వరుడిగా తయారు చేసేందుకు అవసరమైన పట్టువస్త్రాలను, స్వర్ణాంగుళిని ప్రదానం చేయడం. ఆ వస్త్రాదులనే మధుపర్కాలు అంటారు."

"పురోహితులు అబ్బాయికి ఇంకేదో ఇస్తున్నారు?" పరిశీలనగా చూస్తూ అడిగింది.

"ఆఁ! అవును. బెల్లం- పెరుగు తినిపిస్తున్నారు. దాన్ని మధుపర్క ప్రాశన అంటారు."

వరుడ్ని తీసుకొని వెళ్ళారు. తర్వాత పురోహితుడు మహాసంకల్పం పఠిస్తున్నాడు.

"మనది అత్యంత ప్రాచీనమైన సంస్కృతిగా పాశ్చాత్యులే గుర్తించారు. భారతీయ సంస్కృతి విశ్వవ్యాపితంగా ఎట్లా ఉన్నది, ప్రపంచంలోని పుణ్యక్షేత్రాలు, తీర్థాలు, వాటి విశిష్టతలూ చదువుతున్నారు. ఆ తర్వాత ఈ మహా ప్రపంచంలో మనం ప్రస్తుతం నిర్వహించుకుంటున్న ఈ కళ్యాణ వేదిక ఎక్కడున్నదో వివరిస్తున్నారు. సంస్కృతంలో" ఇంతలో....

'బొమ్మలా తయారు చేసిన పెళ్ళికూతురును 'బుట్టలో పెట్టుకొని తీసుకొచ్చారు వేదిక వద్దకు. చేతుల్లో పూర్ణనారికేళంతో, తెల్లని పట్టుచీరలో, బుట్టలోనుండి దిగి పీట మీద కూర్చోవడానికి అడుగులేస్తున్న అలేఖ్య - క్షీరసాగరం నుండి కదలివస్తున్న లక్ష్మీదేవిలా కనిపిస్తున్నది. చూపు మరల్చుకోలేకపోయింది అధ్వర.

పురోహితుడు వియ్యంకుల వంశానుక్రమణికలను వర్ణిస్తున్నాడు.

ఈ కాలం పిల్లకు తాతలపేర్లే గుర్తుండవు. వంశం- గోత్రం సంగతి పెద్దవాళ్ళకూ కొందరికి గుర్తుండటంలేదు. మూడు తరాల వాళ్ళను వంశానికి అనుసంధానం చేస్తూ పురోహితుడు ఒక్కొక్కరిపేరూ స్పష్టంగా చదివాడు. ఇటువంటి కార్యక్రమాలు ఏదో ఒక రూపంలో తరచూ జరుగుతూంటే - అంటే అర్చనలు, వ్రతాలు- పూజలూ వగైరా. అందులో పిల్లలు పాల్గొంటూ ఉంటే భక్తి, పెద్దల పట్ల గౌరవమూ పెరుగుతాయి కదా! 'భక్తి తొమ్మిది రకాలుగా ఉంటుంది, మనస్సును ఒక్కచోట నిల్పడమే భక్తికి స్థూలమైన అర్థం. మంచిని చేయడమే పుణ్యం. 'పరోపకార పుణ్యాయ పాపాయ పరపీడనమ్!' ఎప్పుడో తండ్రి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి అధ్వరకి.

"ఇప్పుడేం చేస్తున్నారు?" తర్వాత దృశ్యం చూస్తూ అడిగింది - అమ్మాయి.

"మంగళ ప్రదమైన జీలకర్ర, బెల్లం వధూవరుల సహస్రారాలపై ఉంచుతున్నారు. దీన్ని

సుమూహూర్తమంటారు......."

"సహస్రారమంటే?

" సహస్రారమంటే - సర్వేంద్రియాల ప్రధానకేంద్రమైన కపాల మధ్య భాగం. ఇక్కడ జీలకర్ర, బెల్లం ఉంచడం ద్వారా శరీరమంతా చైతన్యవంతం, తేజోమయం కావాలని, జీవితకాల మంతా ఈ తేజస్సు నిలిచి ఉండాలనే శుభసంకల్పం ఈ ప్రక్రియ వెనకున్న అర్థం."

"కన్యాం సాలంకృతాం - స్వాధ్వీం...... " పురోహితుడు శ్లోకం పఠిస్తున్నాడు.

"అలంకృతయైన, గుణవతియైన, ధీమంతురాలైన, అడకువగల్గిన కన్యను ధర్మకామార్థ సిద్ధికోసం దానం చేస్తున్నాను స్వీకరించండి" అంటూ వధువు తండ్రి, స్వీకర్తయైన వరునికి దానం చేస్తున్నాడు కన్యను.

"సకల దానాల్లోకీ ఇది గొప్పది, విశిష్టమైంది. రెండు వంశాలకు సంబంధించిన అటు పది తరాలను, ఇటు పది తరాలను నరకం నుంచి తప్పించి, బ్రహ్మలోక సౌఖ్యాన్నీయగలిగే కన్య ఎంతో ప్రత్యేకమైంది. అంటే రెండు వంశాల కీర్తి- అపకీర్తులకు, వృద్ధి క్షయాలకూ ఈ కన్యయే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అధారమై నిలుస్తున్నది...... " పంతులుగారి వ్యాఖ్యానం సాగుతున్నది.

అధ్వర అంతరంగం ఏదో అనిర్వచనీయమైన అనుభూతితో నిండిపోతున్నది. కన్యాదానమంటే ఏదో అట్లతద్దెరోజు 'ఇస్తినమ్మా వాయనం' అన్నంత ఈజీ తతంగం అనుకుంది గానీ ఇంత అర్థం ఉందని ఇంతవరకూ అర్థంకాలేదు. నిజమే. మానవ జీవితంలో స్త్రీకి విశేష ప్రాధాన్యత ఉంది. స్త్రీ ఆకర్షణీయమైంది, వంశవృద్ధి క్షయాలకు ఆధారమైంది అందుకే అందరి దృష్టి ఆమెపై ఉంటుంది. మంచికంటె చెడు తొందరగా ప్రచారమౌతుంది. రుద్రమ, ఝాన్సీ లాంటి స్త్రీలు అంతటి కీర్తి సాధించేందుకు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఎన్ని ఆటుపోట్లకు ఎదురు నిలిచి ఉంటారో.....

"ధర్మేచ - అర్థేచ - కామేచ ...... నాతిచరామి!"

"భారతీయ జీవన విధానాన్ని ప్రతిబింబించేవి చతుర్విధ పురుషార్థాలు, 3 పురుషార్థాల సాధనలో నేను సదా నీతోడు వీడక ఉంటాను. అంటే బతికున్నంతకాలం అర్థ, కామ సాధనలో ధర్మబద్ధంగా నడుచుకుంటాను. ఆ నడవడిలో కలకాలం నీతో కలిసి ఉంటాను." అని వరునిచేత ప్రమాణం చేయిస్తున్నాడు పురోహితుడు-

మంగళవాద్యాల హోరు మిన్నంటింది.

"మాంగల్యం తంతునానేన........... " పురోహితుడు బిగ్గరగా మంత్రం చదువుతున్నాడు.

"ఇంతకూ ఆ మంత్రానికి అర్థమేమిటి?" పంతులుగార్ని అడిగింది- పక్కనున్న అమ్మాయి.

"మాంగల్యం తంతునానేన మమజీవన హేతునా!

కంఠే బధ్నామి సుభగే- త్వంజీవ శరదా శతమ్ !!

"అంటే, నా జీవనానికి నీవు కారణభూతురాలివి. నీవు సుభగవు. దీర్ఘసుమంగళిగా జీవించాలని మాంగల్యాన్ని ధరింపజేస్తున్నా'నని వరుడు పల్కుతూ మంగల సూత్రం కడుతున్నాడు."

"మూడు ముళ్ళెందుకేస్తారు?" కత్తిలా దూసిందా అమ్మాయి ప్రశ్నను.

అతను చిరునవ్వుతో - " ధర్మార్థ కామాల్లో నిన్ను అతిక్రమించకుండా ఉండేందుకు బద్ధుడినవుతున్నా' నని తెలియజేసేందుకే ఆ మూడు ముళ్ళు. వేదాంతపరమైన అర్థంలో అయితే మనసు, బుద్ధి, ఆత్మ సంబంధమైన శక్తుల్ని నీలో నిక్షిప్తం చేస్తున్నానని, త్రికరణ శుద్ధిగా ఈ నియమానికి కట్టుబడి ఉంటానని తెలియజేడమని భావిస్తారు."

"అంటే - ఇవన్నీ భావనలే అన్నమాట. దేవుడు - పాపం- పుణ్యం....."

అధ్వరకు ఆసక్తి పెరిగింది.

"భారతీయ తాత్విక చింతనకు ఆధారం భావన. అంతెందుకు అమ్మంటే అమృతమూర్తి, దివ్యస్వరూపం, దేవుడికి ప్రతిరూపం అనుకున్నావనుకో. అలాగే అనిపిస్తుంది. అట్లా కాకుండా తల్లికూడా ఓ మనిషే. ఆమెకూ అన్ని అవయవాలు, రక్తమాంసాలు ఉన్నాయనుకుంటే- అదీ నిజమే. నీవు సైన్స్‌లేదా పరిశోధన దృష్టితో చూస్తే ఇట్లాగే కనిపిస్తుంది. అట్లా కనిపించడం వల్ల ఆత్మీయతలోపించి యాంత్రికత పెరుగుతున్నది. ఫలితంగా మానవజీవితమంతా కలుషితం, కల్లోలం భీభత్సం......"

అతని పక్కనున్న అమ్మాయి సంగతేమోగాని, అధ్వరకు అతనిపట్ల అమాంతం గౌరవం, అభిమానం పెరిగిపోతున్నాయి. ఆరాధన నిండిన హృదయంతో అతడ్ని చూసింది. ఆయన మాత్రం ఆమెను పట్టించుకునే స్థితిలో లేడు.

'పెళ్ళిళ్లు చకచకా జరగాలి.  ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా ఏమిటీ చాదస్తం?' అని విసుక్కునేది గతంలో.  ఇప్పుడనిపిస్తున్నది ఎంతో శాస్త్రీయ దృక్పథం, ఇంకెంతో ఉదాత్త భావాలుగల మన వ్యవస్థల్ని మనమే అపార్థంచేసుకుంటూ, మూర్ఖంగా విమర్శిస్తూ, ఆత్మవంచన చేసుకుంటున్నాం......'

పాణిగ్రహణం, పుష్పమాలధారణలయ్యాయి.  తలంబ్రాలు పోసుకునేటప్పుడు పూజచేయించి, మంత్రం చదివించాడు పురోహితుడు.

"సంతాన సాధనలో, కీర్తి సాధనలో, తేజో సాధనలో సమృద్ధికరమైన ఆనందము, తృప్తి లభించేలా మనో సంచారరూపమైన కోరికను, వాక్కును, సత్యాన్ని అనుభవింతుముగాక!' అంటూ వధూవరులు పరస్పరాక్షితారోపణ చేసుకుంటున్నారు."

మొదట వధూవరులు పూజాక్షితలు పోసుకున్న తర్వాత పక్కనున్న అల్లరి పిల్లలు రెచ్చగొట్టడంతో మితిమీరిన ఉత్సాహంతో ఒకరిమీద ఒకరు వర్షంలా పోసుకోసాగారు.  ఆదృశ్యం చూసి ఆగలేక పరుగెత్తుకెళ్ళి మిత్ర బృందంలో కలిసిపోయింది అధ్వర.

"ఏయ్! ఎక్కడికెళ్ళావే ఇంతసేపూ?" నిష్ఠూరంగా అంది సాహితి.

"నువ్వేగా రావొద్దన్నావ్?" చిన్నబుచ్చుకున్నట్టు నటిచింది అధ్వర.

"సారీనే, నేనేదో మాటవరసకంటే, నిజంగానే నువ్విలా చేయడమేం బాగాలేదు." నిజంగానే నొచ్చుకుంది సాహితి.

"అంతొద్దులేమ్మా. నాకు మేలే జరిగింది.  ఈ ఉక్కపోతకంటే అక్కడ ఫ్యానుగాలే హాయిగా ఉంది." చివర మాటమార్చి తనూ తలంబ్రాలందుకుంది.

సాహితి మనసు మాత్రం కుదుటపళ్ళేదు.

తలంబ్రాల కార్యక్రమం ముగియడంతోనే  వధువుకు మట్టెలు తొడిగించి సప్తపది పూర్తి చేయించాడు పురోహితుడు- ఒక్కొక్క అడుగుకూ తమలపాటు పరచి ముందు వధువుతో, ఆపై వరుడితో అడుగులేయించాడు - భగవంతుడు **1.** అన్నసమృద్ధిని, **2.** బలాన్ని, **3.** వ్రతఫలాన్ని, **4.** వ్రతాధికారాన్ని, **5.** పశుసమృద్ధిని, **6.** సంతానాన్ని, **7.** యజ్ఞయాగఫలాలను- ఇవ్వాలని వాటిని ధర్మబద్ధంగా తామూ ఆచరిస్తామని వధూవరులు ఏడడుగులు నడిచారు.

ఆ పై కార్యక్రమం మీద దృష్టి కేంద్రీకరించలేకపోయింది అధ్వర.  ఆహూతులంతా

భోజనాలకోసం లేవడంతో సీట్లు చాలా ఖాళీ అయ్యాయి. దూరంగా ఒంటరిగా ఓ కుర్చీలో కూర్చొని కళ్ళు మూసుకుంది. ఆమెలో అంతర్మథనం ప్రారంభమైంది.

'సంప్రదాయం- పరువు- మర్యాద అంటే ప్రాణం పెట్టే తన తండ్రికి తానంటే ఎంతో ప్రేమ, అంతకు మించిన నమ్మకం. ఆ నమ్మకానికి నిర్దాక్షిణ్యంగా తూట్లు పొడుస్తున్నది తాను. ఇంతకూ తనీ ప్రేమలంపటంలో ఎలా చిక్కుకున్నది? అసలు ప్రేమనేదేమిటి? నిజంగా తను ప్రేమిస్తున్నదా? ప్రేమింపబడుతున్నదా? నిఖిల్ కూ తనకూ మధ్యనున్నది ఆకర్షణా? అందులో ప్రేమలేదా? దీని పర్యవసానమేమిటి? తను అమ్మానాన్నల పరువూ మర్యాదలు గాలికొదిలేసి అతనితో లేచిపోవాలనుకోవడం సబబేనా? అదే జరిగితే తమ బతుకులెలా ఉంటాయి? అమ్మా, నాన్నల పరిస్థితేంటి? పైషైతే మాత్రం దూరంకాదా? అదీ - ఇదీ ఒక్కటేనా? పోనీ, నాన్నకు విషయమంతా చెప్పేస్తే.....? ఆయనొప్పుకుంటారా? నిఖిల్ లేకుండా తను బతకగలదా? ఇప్పుడు బతకడంలేదా? బతుకంటే ఏమిటి......? ప్రశ్నలు - ప్రశ్నలు - ప్రశ్నలు..... అంతంలేని ప్రశ్నలు, సమాధానాలు దొరకని ప్రశ్నలు..... తలబద్ధలైపోతున్నట్లనిపించసాగింది. శరీరం చైతన్యం కోల్పోతున్నట్లనిపిస్తూంటే - నీరసంగా ఓ కుర్చీలో కూర్చుంది.

అధ్వరను గమనిస్తున్న మేఘన కంగారుగా అక్కడికి పరుగెత్తుకొచ్చింది - "అద్దూ! ఎనీథింగ్ రాంగ్?!"

"తలనొప్పిగా ఉందే......" అంతకంటే మాట్లాడలేకపోయింది.

కొంచెం ప్రయత్నం మీద మేఘన కాఫీతోపాటు తలనొప్పి మాత్రకూడా సంపాదించ గలిగింది. ఆ తర్వాత డ్రెస్సింగ్ రూంలోకి అధ్వరను చేర్చింది.

రాత్రి సరిగ్గా నిద్రపోకపోవడమో, సరైన విశ్రాంతి కరువుకావడమో, అతిగా ఆలోచించడమో ఆమెను తీవ్రమైన అలసటకులోను చేసింది. మాత్రవేసుకొని, కాఫీ తాగగానే నిద్రముంచుకొచ్చి నట్లనిపించింది. అక్కడే సోఫాలో మేనువాల్చింది.....

"అద్దూ....! అద్దూ.....!" నాలుగున్నర గావస్తుండగా అధ్వరను తట్టిలేపింది అలేఖ్య. "ఆర్‌యూ ఆల్‌రైట్?!" నుదిటిపై చెయివేసి చూసింది. "ఏదో బిజీలో ఉండి నిన్ను చూసుకోలేక పోయానే....." నొచ్చుకుంది.

"వీళ్ళంతా ఏరి?" స్నేహ, సాహితి, మేఘన వగైరా ఫ్రెండ్స్ గురించి అడిగింది- మెల్లగా కళ్ళు తెరుస్తూనే.

"వాళ్ళు వెళ్ళి చాలాసేపయ్యిందే.  నిన్ను డిస్టర్బ్ చేయకూడదని....."

"వ్వాట్? వెళ్ళారా? టైమెంతయ్యిందిప్పుడు?" తలవిదిలించింది.

"ఐదుకు పదినిముషాలుంది......" రిస్టు చూసుకుంటూ చెప్పింది అలేఖ్య.

"ఓహ్ గాడ్!" ఒక్క ఉదుటున లేచి, బాత్రూంలో దూరింది. యాంత్రికంగా మొహం కడుక్కోవడం, తయారుకావడం చేస్తున్నదేగాని ఏంచేయాలో ఖచ్చితంగా నిర్ణయించుకోలేక పోతున్నది.  సమయం కొరడా ఝుళిపిస్తూంటే దిక్కుతోచకుండా పరుగెత్తుతున్నట్టుంది ఆమె పరిస్థితి. 'నాన్న ఫోన్‌చేస్తే, నీవద్దనే ఉన్నానని, రాత్రికి కూడా రాకపోవచ్చని, ఉదయమే పంపిస్తానని చెప్పు.' అని అలేఖ్యతో చెప్పాలనుకుంది.  కాని, చెప్పలేకపోయింది.  'ఏమైనా కొంచెం తినివెళ్ళ'మని బతిమాలినా వినిపించుకోకుండా హడావుడిగా బయటపడింది అక్కడినుండి.

'లంగర్‌హౌజ్ బస్టాప్‌కి ఐదుగంటలకల్లా చేరుకో' అది నిఖిల్ ఆదేశం, ఆహ్వానం,అభ్యర్థన.... దాన్ని గంట క్రితం నిర్ద్వంద్వంగా ఖండించింది.  కాని సమయం అయిపోయింది.  ఇప్పుడు తనను ఏశక్తీ ఆపలేదనిపిస్తూంది.  కాని..... కాని..... కాని.....

ఆలోచనల్లో కొట్టుకుంటూండగానే ఓ ఆటో ఆమె ముందుకొచ్చి సడెన్ బ్రేక్‌తో ఆగింది - పిలిచినట్టు.

రిస్ట్ చూసుకుంది.  ఐదూ-పది.  మరేమీ ఆలోచించకుండా ఆటోలో కూచుంది - "లంగర్ హౌజ్!" చెప్పింది.

అతను మీటరువేసి, ఆటో స్టార్టు చేశాడు.

ఆటో చాలా నెమ్మదిగా వెళ్తున్నట్టునిపించ సాగిందామెకు -" ప్లీజ్! కొంచెం స్పీడ్.....!"

ఆమె ఆలోచనలు ఆటోకి సమాంతరంగా పరుగెత్తుతున్నాయి.  అలేఖ్య పెళ్ళి ఆమెలో అంత మార్పు తెస్తుందని ఆమె ఊహించలేదు.  ఏమయినా ఇప్పుడు నిఖిల్‌తో కలసి రిసార్ట్స్‌కెళ్ళడం మంచిదికాదని మనసు బలంగా హెచ్చరిస్తున్నది.

ఒక్కసారి ఆటోని ఆపి మళ్ళీ వెనక్కి వెళ్ళిపోదామనిపించింది.  అంతలోనే నిఖిల్ గుర్తుకొచ్చాడు. అతనెంతగా ఎదురుచూస్తున్నాడో....? ఏంచేయాలి....?' మళ్ళీ సన్నగా తలనొప్పి మొదలైంది.  ఆటో గాంధీబొమ్మ టర్నింగ్ దాకా వచ్చింది.  'ఇప్పటికైనా దిగి వెళ్ళిపోతే మంచిది.' దృఢంగా అనుకుంది.  అంతలోనే 'ఇంతదూరం వచ్చాను కదా!  ఇప్పటికే ఎంతోసేపటి నుంచి

ఎదురు చూస్తుంటాడు. తనురావడంలేదని అర్జంటు పనుందని చెప్పేసి, ఇదే ఆటోలో వెనక్కెళ్ళిపోవాలి.....' అదే సబబనిపించింది. సరిగ్గా అప్పుడే ఆటో లంగర్‌హౌజ్ బస్టాండు చేరుకుంది.

అక్కడ బైక్ మీద తలకు చేయిపెట్టుకొని టెన్షన్‌గా ఎదురుచూస్తున్నాడు నిఖిల్. ఆటో అతని పక్కనే ఆపించింది అధ్వర.

అదే క్షణం అధ్వరను చూశాడు నిఖిల్. అతని మొహం తళుక్కుమంది. వెంటనే బండి స్టార్ట్‌చేశాడు.

ఆమె ఆటో దిగుతూనే- "నిక్కీ......" అనుకున్న విషయం చెప్పడానికి మాటలు రావడంలేదు ఆమెకు.

"ధరా! ప్లీజ్! ఇప్పటికే చాలా లేటయ్యింది. అదిగో అంతా మనల్నే చూస్తున్నారు. ముందు బండెక్కు." తొందర పెట్టాడు.

"నేను నీవెంట రావడంలేదు!" గట్టిగా అరవాలనుకుంది. కాని, గొంతు పెగలలేదు. "అయ్యో! ఆటోకింకా నేను డబ్బులివ్వలేదు. ఒక్క నిముషం నేను చెప్పేది వింటావా?" లోగొంతుకలో కీచుమంది.

అప్పటికే ఆటోవాలా ఆటోదిగి, అనుమానంగా చూస్తున్నాడు.

"ఆటో! ఏ లేలో...." అతడ్ని పిలిచాడు. చేతిలో యాభై రూపాయలుంచాడు. అతను చిల్లర ఇవ్వబోతుంటే "రఖో" (ఉంచు) అంటూనే "నువ్వెక్కు!" అజ్ఞాపించాడు అధ్వరని. మాట్లాడకుండా బైక్ ఎక్కక తప్పలేదు ఆమెకు.

ఇదంతా గమనిస్తున్న ఇద్దరు వ్యక్తులు కళ్ళతోనే ఏదో మాట్లాడుకున్నారు. అందులో ఒకడు వీళ్ళకు తెలియకుండా ఫాలో అయ్యాడు.

బండి వేగంగా తోలుతున్నాడు నిఖిల్. అతనితో కలిసి అలా ప్రయాణించడం అధ్వరకు అదేమొదలు. మధ్యాహ్నం వరకూ- నిఖిల్ వెంట బండిమీద కూర్చుంటే, గట్టిగా అల్లుకొని, చెవిలో గుసగుసలు పోతూ- ఏమేమో చేయాలనుకుంది. కాని ఇప్పుడతని స్పర్శ ఆనందాన్నీయకపోగా తెలియని భయాన్ని ఆమెలో నింపుతోంది.

"నిక్కీ! ఒక్క నిముషం బండి ఆపుతావా?" నిఖిల్ భుజం నొక్కుతూ అభ్యర్థించింది

అధ్వర. అప్పటికే మూడు కిలో మీటర్ల దూరం వచ్చేశారు.

మరికొద్ది దూరం పోనిచ్చి రోడ్డు పక్కగా ఓ మర్రి చెట్టు నీడన ఆపాడు. ఆమె దిగింది. అతనట్టాగే కాళ్ళు నేలమీద ఆనించి కూర్చున్నాడు.

"ఇప్పుడు రావడానికి నాకు వీలుకాదు." పాఠం అప్పజెప్పినట్టు చెప్పింది - తలవంచుకొని.

అతను షాకయ్యాడు. ఆటోదిగిన క్షణం నుండీ గమనిస్తున్నాడు, ఏదో తేడా ఆమెలో స్పష్టంగా కనిపిస్తూంది. ఆ మాటలు అతడ్ని బాగా అప్‌సెట్ చేశాయి. మొహంలోకి చూశాడు. తలఎత్తలేదామె.

"ధరా! ఇవాళ నీకేమైంది? ఎంతో రిస్క్ తీసుకొని, డబ్బులు ఖర్చు పెట్టి నేనీ అరేంజ్‌మెంట్ చేశాను. నువ్విప్పుడు సడన్‌గా కాదంటే ఎలా?" క్షణమాలోచించాడు - "పోనీ, ఈ మాట్లాడుకునేదేదో అక్కడే మాట్లాడుకుందాం. తర్వాత తొందరగానే వచ్చేద్దాం పద!" అతని గొంతులో అసంతృప్తి, మొహంలో నిరుత్సాహం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నిఖిల్‌ని అలా చూస్తుంటే గుండెల్లో బాధనిపించింది అధ్వరకి. 'నిక్కీ నువ్వు రమ్మంటే నరకానికైనా సిద్ధమే!' అని రెండ్రోజుల కింద తనన్నమాటలు గుర్తుకొచ్చాయి. ఆమె ద్వైవీ భావంలో కొట్టుకుండగానే బైక్ స్టార్ట్ చేశాడు అతను.

యాంత్రికంగా మళ్ళీ కూర్చుంది. ఎందుకో కన్నీళ్లాగలేదు. నెమ్మదిగా అతని భుజంమీద తల ఆనించింది. ఏదో తృప్తి..... మరికొన్ని నిముషాల్లోనే వాళ్ళు రిసార్ట్స్‌కి చేరుకున్నారు.

0-0-0

వాళ్ళున్న గది బయటికి వెదెఉరు బద్దలతో ఓ పూరి గుడెసలా కనిపించినా, లోపలన్నీ అధునాతన సౌకర్యాలున్నాయి. నిఖిల్ మాటలతో, స్పర్శతో క్రమేపీ అధర్వలో భయం తొలగిపోసాగింది. అతను తెప్పించిన పదార్థాలు తింటూ, మధ్య మధ్యలో కూల్ డ్రింక్ తాగుతూ... అనంతమైన విషయాలు మాట్లాడుకోవడంలో ఆనందాన్ని అనుభవిస్తోంది ఆమె. అంతా థ్రిల్లింగ్‌గా ఉందిప్పుడు. ఏదో తెగింపు ఆమెలో క్రమంగా బలపడసాగింది. గంట క్రితం వరకు తను చేస్తున్న పని తప్పనిపించినా, ఇప్పుడా ఆలోచనను దగ్గరకి రానివ్వడం లేదు మనసు.

హఠాత్తుగా ఆమెకేదో గుర్తొచ్చింది. ఠక్కున రిస్ట్ చూసుకుంది.

అది గమనించిన నిఖిల్ గబుక్కున వాచీపై నుండి ఆమె చేయి పట్టుకున్నాడు-"ఇక్కడ

చేయకూడని పని అదొక్కటే. ఇక్కడ కాలం ఆగిపోతుంది. మన పనులు సాగిపోతాయి........" ఆమెకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా తన కౌగిలిలోకి తీసుకొని, మంచం దాకా నడిపించుకపోసాగాడు.

ఆమె శరీరం వణుకుతున్నది. ఏదో తప్పుచేస్తున్నానన్న భావన...... మనసు ఎదురు తిరుగుతోంది కాని, నోట మాట రావడంలేదు. మరో క్షణంలో మంచం చేరుకుంటారనగా -

"టక్....టక్.... టక్.... " డోరు మీద శబ్దం.

ఉలిక్కిపడి విడిపోయారిద్దరూ. ఏం చేయాలో ఎవరికీ తోచలేదు.

మరో మారు డోర్ మీద చప్పుడు.

"నువ్విక్కడే.... ఆహ..... టేబుల్ వద్ద.... సోఫా..... కాదు కాదు....." అతను కంగారుపడుతూ ఏదో చెబుతున్నంతలోనే తలుపుమీద మళ్ళీ శబ్దం-

పరుగెత్తుకుంటూ వెళ్ళి డోర్ తీశాడు. తలుపుకొద్దిగా తెరిచి చూశాడు.

ఇంతలో వణుక్కుంటూ వెళ్ళి ఇంతకు ముందు కూర్చున్న సోఫా మీద కూర్చున్నది తలవంచుకొని.

అగంతకుడు నిఖిల్‌ని నెట్టుకుంటూ లోపలికొచ్చాడు. హిందీలో చెప్పాడు నిఖిల్‌తో- "పోలీస్ రైడింగ్ సమాచారం అందింది. మావాళ్లు చూసుకుంటున్నారు. అయినా కొంచెం జాగ్రత్తగా ఉండండి.... ఎవరైనా వస్తే ....."

అతని మాటలు పూర్తికాలేదు. బయట ఏదో కలకలం. అతను అలర్ట్ అయిపోయాడు. దాదాపు అరచినట్టే అన్నాడు -" తొందరగా ఆమెను వెనక డోర్ నుంచి లేడీస్ టాయిలెట్స్ దగ్గరికి పంపించేసెయ్....."

నిఖిల్‌కేమీ అర్థంకాలేదు. కాదు, భయం వల్ల జడత్వంలోకి జారిపోయాడతను. ఆలస్యం వల్ల కల్గేనష్టం అతనికి తెలుసు. అందుకే అతనే ఆపని చేశాడు. ఆమెను వెనక డోర్ నుండి బయటకు పంపి, దారి చూపించాడు.

ఒక్కక్షణం ఆలస్యమైనా నిఖిల్‌తో పాటు అధ్వరనూ పట్టుకునేవాళ్ళు పోలీసులు. వాళ్ళు ఆమెను గమనించేలోపే ఆమె టాయిలెట్స్ గదికి చేరుకోగలిగింది.

అధ్వర వయసుకి సుమారు అటూ ఇటూగా మరికొంతమంది ఉన్నారక్కడ. కొందరికది

పూర్వానుభవంలాగే ఉంది చలించకుండా ఉన్నారు. మరికొందరు భయంతో వణికిపోతున్నారు.

తల తిరిగిపోసాగింది అధ్వరకి. ఏదో వాంతి కొచ్చినట్లవుతోంది. ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దైపోతూంది. దుఃఖమాగలేదు. పసిపిల్లలా భోరుమంది - ఒక్కసారిగా.

పక్కనే ఉన్న ఓ బురఖా యువతి ఆమెను పొదివి పట్టుకుంది. ఓదార్చింది. వివరాలడిగింది నెమ్మదిగా హిందీలో.

తన సంగతి క్లుప్తంగా చెప్పింది - ఏడుస్తూనే అధ్వర.

"ఓహో! తెలుగమ్మాయివా? ఇక్కడికెందుకొచ్చావమ్మా ఈ వేళప్పుడు. ఈ మధ్య టీవీ ఛానళ్ళ వాళ్ళూ కన్నేసి ఉంచారు. టీవీలో కనిపిస్తే ఇంకేమైనా ఉందా?"

ఆ దృశ్యం ఊహించుకోగానే ప్రాణాలు పోయినంత పనైంది అధ్వరకి. 'అంతకంటే ఈ గదిలో చచ్చిపోవడమే మేలు' అనుకుంటూ మార్గాలను వెతకసాగింది.

టాయిలెట్ గదిమీద పోలీస్ లాఠీలు టకటకలాడాయి.

కుప్పకూలిపోయింది అధ్వర.

"ఏయ్ అమ్మాయ్! భయపడకు. ఈ డ్రెస్ వేసుకో!" తన బురఖాతీసి అధ్వరకు తగిలించింది.

ఆమె చేస్తున్న సాయానికి నోటమాట రాలేదు అధ్వరకు. ఆమె చేతులు పట్టుకొని, కన్నీళ్ళు కార్చింది.

చిరు మందహాసంతో గుండెలకు హత్తుకుంది ఆమె. తాను ముస్లింను కానని, తన వృత్తికి ఏ మతం రంగూ అంటుకోదని, తనలా మరొకరు మారకుండటానికి సాయపడటం కంటే పుణ్యమేముంటుందనీ ఆమె చెప్పాలనుకుంది.

ఇంతలో పోలీసులు తలుపులు విరగ్గొట్టి లోపలికొచ్చారు. అందులో కొందరు బూతులు తిడుతూ అందర్నీ బయటికి లాక్కొనిపోయారు.

మిగతావాళ్ళంతా మొహాలు దాచుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూంటే అర్థమైంది అధ్వరకి ఏదో టీవీ కెమెరా తమని షూట్‌చేస్తున్నదని.

సుమారు అరగంటసేపు ఆ నరకం. చివరికేవో సంప్రదింపులు జరిగాయి. మొత్తంమీద

పోలీస్ స్టేషన్‌కి తీసుకెళ్ళకుండానే వదిలేశారు వాళ్ళని. బయటికెళ్తూంటే ఎవ్వరి మొహంలోనూ జీవకళలేదు. అధ్వర పరువు కాపాడిన యువతే మరోభారం తన నెత్తికెత్తుకొని ఆమెను ఇంటి దరిదాపుల్లో ఆటోలో వదిలేసింది.

బురఖాను ఆమెకు తిరిగి ఇచ్చేస్తూ, తన దగ్గరున్న డబ్బులన్నీ ఆమెకు బలవంతంగా ఇవ్వబోయింది. అందుకామె ఒప్పుకోలేదు.

0-0-0

"డోర్ చెరిచే ఉంది. లోపలికిరా!" ఆచార్యులగొంతు.

అప్పుడు రాత్రి పదకొండు గావస్తున్నది.

మెల్లగా లోపలికొచ్చి డోర్ వేసింది. తండ్రి కళ్ళలోకి చూడలేకపోతూంది అధ్వర. ఏదో చెప్పాలని....

"నువ్వేమీ చెప్పొద్దు. పెళ్ళివాళ్ళింట్లోనే లేటయ్యిందని, ఆలస్యంగా వస్తానని చెప్పిందని మీ అమ్మతో చెప్పాను. ఆమె పడుకుంది. ఈ రాత్రికి నువ్వు నిశ్చింతగా నిద్రపో!" ఆ గొంతులో కాఠిన్యంలేదు. కాని, అంతకుమించిన గాంభీర్యముంది. ఏదో బాధ మాటలకల్లుకొని వస్తున్నది.

"భోంచేశావా?" ఆమె బెడ్రూంలోకి వెళ్తూండగా అడిగాడు ఆచార్యులు. ఆమాటలు ఆమెలోని బాధను మరింత తీవ్రం చేశాయి.

దుఃఖం, అవమానం, అపరాధభావం ముప్పిగొనగా మంచమ్మీద కూలిపోయింది అధ్వర. ఆ రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. దిండు కన్నీళ్ళు దాచుకోగల్గింది గానీ ఆమె బాధను మాత్రం పంచుకోలేకపోయింది.

ఉదయం ప్రసూనాంబ పూజాగదిలో ఉండగా కూతురు గదిలోకొచ్చాడు ఆచార్యులు.

"బంగారూ.....! బంగారూ.....!" అదే అమృతమొలికే పిలుపు.

అప్పుడప్పుడే కళ్ళు మూతలు పడుతుండగా- ఉల్కిపడిలేచింది.

మొద్దుబారిన ఆమె మెదడు, శక్తికోల్పోయినమేను, జడత్వంలోకి జారిన మనస్సుపై అతను మంత్రజలంలాంటి మాటల్ని ప్రోక్షణ చేయసాగాడు - మంచమ్మీద- రెండు కాళ్ళ మధ్యలో తలపెట్టుకొని మౌనంగా వింటున్నది అధ్వర.

"బంగారూ! నాకూతురు ఏ తప్పూ చేయదనే గట్టినమ్మకం ఉండేది ఇన్నాళ్ళూ..... ఇప్పుడూ నాలో ఆ నమ్మకం సడలలేదు. ఒకవేళ అలాంటిదేదైనా జరిగితే అందులో నాకూ భాగం ఉంటుందిరా.....!"

మళ్లీ ఆమె కళ్ళు వర్షించసాగాయి.

"చూడమ్మా! నేను సంప్రదాయవాదినే కాని, మూర్ఖుణ్ణికాను. మనం పాటించే సంప్రదాయంలో మనదేశం, ధర్మం ప్రతిబించాలని కోరుకుంటాను. అన్నిటికీమించి పదిమందికీ మంచి జరగాలని కోరుకుంటాను. ఆచరణ శీలం మీద నమ్మకం గలవాడ్ని నాలాగే నాపిల్లలూ ఎదుగుతున్నారని అనుకుంటాను. అలా జరగకపోతే తప్పు నాతోపాటు సమాజానికి, విద్యా విధానానికీ అంటుకుంటుంది."

ఆమె దుఃఖం వెక్కిళ్ళను అందుకుంది.

"అయినా నా బిడ్డ సుఖం కోసం సంఘం కట్టుబాట్లనెదిరించేందుకు నేను సిద్ధమే. కాని... నువ్వు చేసే పని మంచో చెడో ఆలోచించడం మాత్రం మరవొద్దని నిన్ను.... వేడుకుంటున్నాను...." కన్నీళ్ళతో చేతులు జోడించాడు ఆచార్యులు.

నరాలు తెగిపోయేలా రోదించసాగింది అధ్వర.

కూతురు దగ్గరికి నడిచాడు ఆచార్యులు - "బంగారూ! నీకు మంచి చేయడానికే నేనున్నానమ్మా! బాధపడకు! తొందరపడకు!! ఏ బలహీనమైన నిర్ణయమూ తీసుకోకు......" ఆప్యాయంగా తలనిమిరాడు.

తండ్రి నల్లుకొని వెక్కి- వెక్కి యేడ్చింది అధ్వర.

'నాన్నా? నేను నీ కూతుర్ని నాన్నా! నీకు తలవంపులు తెచ్చే పని యేదీ చేయను. బుద్ధొచ్చింది. నీవు చెప్పినట్టే నడుచుకుంటాను. నీ పాదాలనంటి ప్రమాణం చేస్తున్నాను....." అని గట్టిగా అరవాలనుకుంది. కాని ఏడుపు తప్ప ఒక్కమాట కూడా ఆమె నోటి నుండి రాలేదు. ❖

(మార్చి 2005)